

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి ఎస్‌బీఐ గ్రామీణ శిక్షణ కేంద్రంలో ఈ నెల 19 తేదీ నుంచి 31 వరకు సీసీటీవీ ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నామని ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ తెలిపారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన 19 నుంచి 45 ఏళ్ల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు బ్రాంచ్‌ను సంప్రదించాలని డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ కోరారు.



దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- 'ప్రజావాణి'లో వినతులు స్వీకరించిన అధికారులు


నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి దరఖాస్తుదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతీ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 94 వినతులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఇన్‌చార్జి డీపీవో శ్రీనివాస్‌లకు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు మాట్లాడుతూ.. మాట్లాడుతూ అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడూ పరిశీలన జరుపుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు గౌరవ వేతనం రూ.18వేలు ఇవ్వాలి

రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఆశావర్కర్లకు గౌరవ వేతనం 18వేలు ఇవ్వాలని లేకపోతే ఉద్యమం తప్పదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. ఈనెల 19న బస్సు యాత్ర జిల్లాకు చేరుకుంటుందని జిల్లాలోని ఆశావర్కర్లు పెద్ద సంఖ్యలో హాజరుకావాలన్నారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో, కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలి

ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపే ధర్నాచౌక్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలని సీపీఐ (ఎం) జిల్లా కమిటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజాసమస్యలను ప్రజల దృష్టికి తీసుకొచ్చేందుకు ప్రజలు వివిధ రూపాల్లో నిరసన తెలపడం సహజమని కాని రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా నిజామాబాద్ కలెక్టరేట్ వద్ద ఎవరూ నిరసన వ్యక్తం చేయకుండా నోటీసులు ఇచ్చి కేసులు పెడుతున్నారని ఆయన అన్నారు. గతంలో పాత కలెక్టరేట్‌కు ఎదురుగా ధర్నాచౌక్‌ను నిరసన తెలిపేందుకు కేటాయించినప్పటికీ అక్కడ సౌకర్యాలు సరిగ్గాలేవన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో నాయకులు పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, శంకర్, రాములు పాల్గొన్నారు.



అన్యాక్రాంతం

- చట్టాల్లోని లొసుగులతో పట్టాలుగా మారుతున్న పేదల స్థలాలు
- నేతలు, ఉద్యోగుల సహకారంతో భూములకు పట్టాలు
- పేదలకు ఇచ్చిన భూముల్లో.. వెంచర్లు భారీ నిర్మాణాలు
- అయినా పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- జిల్లాలో లక్షా 75వేల ఎకరాలకు పైగా అసైన్డ్ కింద భూ పంపిణీ

నిజామాబాద్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. ధరణిలోని లొసుగులతో పట్టాలుగా మారుతున్నా ఆపేవారు లేరు. భూములకు ధరలు వచ్చి రియల్ ఎస్టేట్‌గా మారుతున్నా.. వాటిని నిలువరించే వారు లేరు. అన్ని చోట్ల నేతలు, ఉద్యోగుల సహకారం ఉండటంతో అసైన్డ్ భూములు ప్లాట్లుగా మారుతున్నాయి. ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. అసైన్డ్ భూముల మార్పిడికీ అవకాశం లేకున్నా.. రెవెన్యూ చట్టాల్లోని లొసుగులను ఉపయోగించుకొని పనులు పూర్తి చేస్తున్నారు. విలువైన భూములను కొల్లగొడుతున్నారు. నిజామాబాద్ నగరం చుట్టుపక్కలే కాకుండా బోధన్, ఆర్మూర్, భీంగల్ మున్సిపాలిటీల పరిధిలో ఈ వ్యవహారం కొనసాగుతోంది. కీలక స్థానాల్లో ఉన్న నేతలు, అధికారులు సహకరించడం వల్ల గత కొన్నేళ్లుగా ఈ వ్యవహారం కొనసాగుతోంది. ఎక్కడైనా ఫిర్యాదులు వస్తే వాటిని బుట్టదాఖలు చేస్తున్నారు. యథేచ్ఛగా పనులను కొనసాగిస్తున్నారు. పేదల కోసం ఇచ్చిన భూముల్లో భారీ నిర్మాణాలు కొనసాగుతున్నా పట్టించుకునే వారే లేరు.

భూమిలేని పేదలకు భూ పంపిణీ

జిల్లాలో 1965 నుంచి పేదలకు అసైన్డ్ భూముల పంపిణీ చేపట్టారు. భూమిలేని నిరుపేదలకు ఎకరం నుంచి మూడు ఎకరాల వరకు భూ పంపిణీ చేశారు. ఎస్సీ, ఎస్టీతో పాటు ఇతర వర్గాలకు కూడా ఈ భూములను అసైన్డ్ చేశారు. అసైన్డ్ చట్టం ప్రకారం ఈ భూములను కేటాయించిన వారే వినియోగించుకోవాలి. వారి తదనంతరం వారసులు వినియోగించుకునే విధంగా చట్టంలో అవకాశం కల్పించారు. ఈ భూములను అమ్మేందుకు అవకాశం లేదు. జిల్లాలో దాదాపు లక్షా 75 వేల ఎకరాలకు పైగా అసైన్డ్ కింద భూ పంపిణీ చేశారు. వీటిలో చాలా భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లాయి. కొన్ని భూములు పట్టాలుగా కూడా మారాయి. ధరణి వచ్చిన తర్వాత ఎక్కువ శాతం భూములకు పట్టాలుగా అవకాశం వచ్చింది. భూముల ధరలు పెరిగిన తర్వాత అసైన్డ్ ల్యాండ్ కొన్నవారు చట్టాల్లోని లొసుగులను వినియోగించుకొని పట్టాలు చేయించుకున్నారు. రెవెన్యూ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కొంత మంది సహకరించడం వల్ల ఎక్కువ మొత్తంలో ఈ భూములు పక్కదారి పట్టాయి. నిజామాబాద్ నగరం చుట్టూ అసైన్డ్ భూములు ఎక్కువగా పంపిణీ చేశారు. వీటిలో ఎక్కువ శాతం ప్రస్తుతం వారి వారసుల చేతిలో లేవు. ఆ భూములు చేతులు మారాయి. కొన్ని రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మారిపోయాయి.

నగర పరిధిలో భారీగా పెరిగిన ధరలు

నిజామాబాద్ నగరం భారీగా పెరగడం వల్ల భూముల రేట్లు ఎక్కువ అయ్యాయి. కార్పొరేషన్‌గా మారిన తర్వాత శివారు మార్గంలోని భూములకు డిమాండ్ వచ్చింది. నగరం చుట్టూ నిజామాబాద్ రూరల్, మోపాల్, మాక్లూర్, నవీపేట, ఎడపల్లి మండలాల పరిధిలోని గ్రామాల్లో డిమాండ్ ఎక్కువైంది. ఈ మండలాల పరిధిలో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఎక్కువగా వచ్చాయి. ఈ వెంచర్లలోని కొన్నింటిలో పట్టా భూములతో పాటు అసైన్డ్ భూములు కూడా ఉన్నాయి. వీటిని ప్లాట్లుగా చేసే అవకాశం లేకున్నా ధరణి వచ్చిన తర్వాత మూడు, నాలుగు గుంటలుగా చేసి వీటికి పట్టాలను ఇచ్చారు. వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేశారు. ఈ వెంచర్లతో పాటు వీటిని అమ్మకాలు చేయడంతో ఇళ్ల నిర్మాణం కూడా జరిగింది. నగరం చుట్టూ వేల ఎకరాలను అసైన్డ్ కింద భూములను ఇచ్చారు. ప్రస్తుతం అసలైన లబ్ధిదారుల చేతిల్లో సగం భూములు కూడా లేవు. నగరం చుట్టుపక్కల పనిచేసిన కొంత మంది రెవెన్యూ అధికారులు చట్టాల్లోని లొసుగులను ఉపయోగించి కొన్నవారికి అనుకూలంగా వ్యవహరించారు. పట్టాలను మంజూరు చేశారు. ఆ భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలువడడంతో పాటు అమ్మకాలు జరిగాయి. ఇప్పటికీ కొత్తగా వేసిన కొన్ని వెంచర్లకు కూడా అసైన్డ్ భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

చేతులు మారుతున్న విలువైన భూములు

నగరంలో కొన్నేళ్లుగా కీలకంగా వ్యవహరిస్తున్న నేతలు, ఉద్యోగులు, సంఘాల నేతలు సహకరించడంతో విలువైన భూములు చేతులు మారాయి. ఇప్పటికీ ఈ భూములు చేతులు మారుతూనే ఉన్నాయి. జిల్లాలోనే దీర్ఘకాలికంగా పనిచేస్తున్న ఉద్యోగులు సహకరించడం వల్ల పనులు కొనసాగుతున్నాయి. కొంత మంది ఉద్యోగులు వింగ్‌గా వ్యవహరించడం వల్ల ఈ అసైన్డ్ భూములన్నీ పట్టాలుగా మారుతున్నాయి. వీరితో పనిచేసిన ఉద్యోగులు ఇతర జిల్లాలకు బదిలీ అయి వెళ్తున్నా.. వీరు మాత్రం ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వాలు మారినా నేతలు సహకరించడం వల్ల ఇతర జిల్లాలకు బదిలీ కావడం లేదు. ఇతర డివిజన్‌లకు కూడా వెళ్లడం లేదు. నేతలకు కావాల్సిన పనులను చక్కబెట్టడంతో పాటు నిధులను ఇతర రంగాల్లో వీరు పెట్టుబడి పెడుతున్నారు. జిల్లాలోని బోధన్, ఆర్మూర్ మున్సిపాలిటీల పరిధిలో ఇదే విధమైన పరిస్థితి ఉంది. అసైన్డ్ భూములు ఎక్కువగా రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారాయి. ఈ భూములపై ఎన్ని ఫిర్యాదులు ఇచ్చినా.. నామమాత్రం చర్యలు ఉంటున్నాయి. నేతలు సహకరించడం ఎక్కువ వెంచర్లలో వాళ్లే ఉండటం వల్ల ఈ భూములకు పట్టాలు వస్తున్నాయి. జిల్లాలో అసైన్డ్ భూముల వ్యవహారంలో నిఘా వర్గాలతో పాటు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల అధికారులు గతంలో పలు దఫాలు ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చిన చర్యలు మాత్రం లేవు. అన్నిచోట్ల నేతల సహకారం ఉండటం వల్ల ఇవి కొనసాగుతున్నాయి. అధికారులు ఇప్పటికైనా దృష్టిపెడితే అసైన్డ్ భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండే అవకాశం ఉంది.

'వాల్టా' చట్టానికి తూట్లు!

- నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల నిర్వహణ
- బట్టీల తయారీకి ఉచిత విద్యుత్ వినియోగం
- అక్రమంగా కలప, మట్టి తరలింపు
- పత్తాలేని మైన్స్ అధికారులు

7



ప్రశాంతంగా ముగిసిన గ్రూప్-2 పరీక్షలు

- రెండో రోజు అంతంతే హాజరు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం పేపర్- 1, 2 పరీక్షలు జరగగా, సోమవారం పేపర్-3, 4 పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30ల వరకు నిర్వహించిన పేపర్-3 పరీక్షకు మొత్తం 19855 మంది హాజరుకావాల్సి ఉండగా 8915 మంది హాజరుకాగా 10,940 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు నిర్వహించిన పేపర్-4 పరీక్షకు 8,911 మంది హాజరుకాగా 10,944 మంది గైర్హాజరయ్యారు. ఆదివారం జరిగిన పరీక్షలకు 10వేలకు పైగా అభ్యర్థులు గైర్హాజరు కాగా సోమవారం సైతం పరీక్షకు 10వేలకు పైగా అభ్యర్థులు గైర్హాజరు కావడం గమనార్హం. మొత్తం అభ్యర్థుల్లో 50శాతంకు పైగా అభ్యర్థులు గైర్హాజరయ్యారు. రెండు రోజుల పాటు 63 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు.



పసుపు పంట విక్రయాలకు ఏర్పాట్లు

- గిట్టుబాటు ధరకు మార్కెట్ కమిటీ చర్యలు
- ఈ ఏడాది 10లక్షల క్వింటాళ్ల అంచనా
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

ఖిల్లా, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపు పంట విక్రయాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది. ఈ ఏడాది సుమారు 10లక్షల క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగే అవకాశాలు ఉన్నందున అందుకు అనుగుణంగా యార్డ్‌లో ఏర్పాట్లు చేస్తున్నారు. రైతు పండించిన పసుపునకు గిట్టుబాటు ధర పలికే విధంగా అన్ని చర్యలు తీసుకోనున్నారు. లావాదేవీలను పారదర్శకంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్నారు. ఈ నెల చివరి వారంలో పసుపు పంటను రైతులు యార్డ్‌కు తీసుకొచ్చే అవకాశాలు ఉన్నందున రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. గతేడాది సుమారు 7లక్షల క్వింటాళ్ల పసుపు విక్రయాలు జరగడంతో ఈ ఏడాది సుమారు 10లక్షల క్వింటాళ్ల పసుపు పంట వ్యాపారం జరిగే అవకాశాలు ఉంటాయని యార్డ్ అధికారులు అంచనా వేస్తున్నారు.

రైతులకు ఇబ్బంది కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం..

:అపర్ణ, వ్యవసాయ మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి

తెలంగాణాలోనే పసుపు పంట క్రయవిక్రయాలు జరిగే ఏకైక మార్కెట్ నిజామాబాద్ కావడంతో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వచ్చేనెల నుంచి వ్యాపార లావాదేవిలు జరిగే అవకాశాలు ఉన్నందున మార్కెట్‌యార్డ్‌లో ఇప్పటి నుంచే అన్ని వసతులు మెరుగుపర్చుతున్నాం. ముఖ్యంగా ఆన్‌లైన్ వ్యాపారాల్లో మోసాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

ఏపుగా పెరిగిన పంట

గతంలో కన్న ఈ ఏడాది పసుపు పంట ఏపుగా పెరిగి పంట చేతికి వచ్చే సమయం దగ్గరపడింది. రెండేళ్లుగా చీడపీడల బెడదతో పసుపు దిగుబడులు చాల వరకు పడిపోయి రైతులకు నష్టాలు కొని తెచ్చాయి. దిగుబడులు తగ్గినా ధర కూడా పలుకలేదు. రైతుల వద్ద నుంచి వ్యాపారులు కొనుగోలు చేసిన అనంతరం చివరి ఏప్రిల్, మే నెలల్లో పసుపునకు డిమాండ్ పెరిగింది. దీంతో మొదట రూ.6వేల నుంచి రూ.9వేల వరకు పలికిన ధర ఏకంగా రూ.14 వేలనుంచి 20వేల వరకు ధర పలికింది. అప్పటికే రైతుల వద్ద నుంచి పసుపు పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి మారిపోయింది. అయితే ఈ ఏడాది పసుపు పంటకు ఆశించిన చీడపీడలు సోకలేదని దిగుబడులు ఆశించిన మేర వస్తాయని రైతులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులకు తగ్గట్టుగా ధర కూడా పలికితే తమకు నష్టాల కంటే లాభాలు వస్తాయని రైతులు ఆకాంక్షిస్తున్నారు. పసుపునకు వ్యాధులు సోకక పోవడంతో ఈ ఏడాది గతేడాది కంటే సుమారు 3లక్షల క్వింటాళ్ల పసుపు పంట అమ్మకానికి వస్తుందని వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అందుకనుగుణంగా మార్కెట్‌యార్డ్‌లో వసతులను కల్పించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు.

పసుపు సాగుకు ప్రాధాన్యం

జిల్లాలోని ఆయా మండలాల్లో రైతులు వరి పంట సాగు అనంతరం పసుపు పంటసాగుకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. వాణిజ్యపంటల్లో కెల్లా పసుపు పంట ద్వారా ఎక్కువ లాభాలు వస్తాయని ఆశిస్తారు. దీంతో మే, జూన్ మాసాల్లోనే మొక్కజొన్న పంటతో పాటు అంతర పంటగా పసుపును సాగుచేస్తారు. జిల్లా రైతులతో పాటు పక్క జిల్లాలైన నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి పసుపు పంటసాగు చేస్తారు. సాగు చేసిన పంటను తెలంగాణాలోనే అతి పెద్ద మార్కెట్ అయిన జిల్లా కేంద్రంలో విక్రయాలు పెద్ద ఎత్తున జరుగుతాయి.

ముందుగా ప్రతిభ రకం పసుపు అమ్మకానికి..

ఏటా డిసెంబరు చివరి వారంలో ప్రతిభ రకం పసుపు పంటను రైతులు యార్డ్‌కు అమ్మకానికి తీసుకొస్తారు. డిసెంబర్ మూడో వారంలో ప్రతిభ రకం పసుపు తవ్వకాలు మొదలు పెడ్తారు. దానిని ఉడుక బెట్టి డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మొదటి వారంలో అమ్మకానికి తీసుకొస్తారు.

దొంగతనాల నియంత్రణకు చర్యలు

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు తీసుకొచ్చే ఉత్పత్తులు దొంగతనాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా యార్డ్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పనితీరును

మిగతా 8వ పేజీలో...

సమావేశంలో మాట్లాడుతున్న తాహెర్‌బిన్ హందాన్



క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చు

- సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఉర్దూ అకాడమీ చైర్మన్

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రమశిక్షణతో అనేక విజయాలు సాధించవచ్చని రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో జిల్లా స్థాయి సీఎంకప్ క్రీడా పోటీలను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడా జ్యోతిని వెలిగించి క్రీడా పరుగును నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు క్రీడా యూనివర్సిటీని ప్రారంభిస్తుందన్నారు. గ్రామీణ స్థాయి క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం సీఎం కప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ, మండల స్థాయి క్రీడలను నిర్వహించుకుని జిల్లా స్థాయి పోటీలను నిర్వహించుకున్నట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి

మిగతా 8వ పేజీలో...



వాలీబాల్ పోటీలో తలపడుతున్న డిచ్‌పల్లి, సిరికొండ జట్లు



పోతంగల్‌లో రాస్తారోకో చేస్తున్న దృశ్యం

ఆసరా పింఛన్‌ల కోసం బీజేపీ రాస్తారోకో

కోటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలో సోమవారం కొత్త ఆసరా పింఛన్‌లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. కోటగిరి, పోతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో కొనసాగించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. పింఛన్‌ల పెంపు, కొత్త పింఛన్‌ల మంజూరు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. ఆరు గ్యారంటీలను ఇప్పటికైనా అమలు చేసి ప్రజలకు అండగా నిలవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు, శంకర్, రమేష్, వెంకట్రావు, తుకారాం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో దూకి వ్యక్తి ఆత్మహత్య



మృతిచెందిన సుధాకర్

నవీపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం బాధ భరించలేక నిజామాబాద్‌కు చెందిన మాడుగుల సుధాకర్(42) అనే వ్యక్తి యంచ గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై వినయ్ తెలిపారు. నిజామాబాద్ పాటిగల్లీకి చెందిన సుధాకర్ ఖానాపూర్ రైస్‌మిల్లులో కూలీ పనిచేసే వాడన్నారు. అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారని ఆదివారం బాసరకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడని అన్నారు. యంచ గోదావరి బ్రిడ్జిపై బైక్, సెల్‌ఫోన్ ఉంచి నదిలో దూకగా మృతదేహం సోమవారం లభ్యమైందని తెలిపారు. మృతుడికి భార్య లావణ్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలిక అదృశ్యం

నవీపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన 16 సంవత్సరాల వయసు గల బాలిక అదృశ్యమైందని ఎస్సై వినయ్ తెలిపారు. రెంజల్ మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదివే ఆమె ఇటీవల తమ సమీప బంధువు మృతి చెందడంతో స్వగ్రామానికి వచ్చిందని అన్నారు. ఈ నెల 14న తన కోసం ఎవరు వెతక వద్దని పేర్కొంటూ ఉత్తరం రాసి పెట్టి వెళ్లిందని ఆయన పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డీసీఎం ఢీకొని వ్యక్తికి గాయాలు

రెంజల్,డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): రెంజల్ మండలంలోని అంబేద్కర్ నగర్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి డీసీఎం ఢీకొనడంతో సాటాపూర్ గ్రామానికి చెందిన వడ్ల భూమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సాటాపూర్ గ్రామానికి చెందిన వడ్ల భూమేష్ తన ద్విచక్ర వాహనంపై సాటాపూర్ గేటు నుండి సాటాపూర్ వస్తుండగా అంబేద్కర్ నగర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని డీసీఎం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయని గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించడం జరిగిందని అన్నారు. భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రాంపూర్‌లో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాంపూర్ గ్రామంలో ఆదివారం రాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్ల యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసులకు సమాచారం అందించాలి

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు, మహిళల పట్ల ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తక్షమే పోలీసులకు సమాచారం అందించాలని సబ్‌డివిజన్ షీటీం బృందం తెలిపారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ కాంతి హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు సమస్యలు వచ్చినప్పుడు భయపడకుండా అప్రమత్తంగా ఉండాలని, షీటీంను ఆశ్రయించాలని కొన్ని యథార్థ సంఘటనలు వివరించారు. సంబంధిత అధికారులకు 100 లేదా 87126 59795 నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనంతరం షీటీం స్కానర్ లోగో గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షీటీం బృందం కానిస్టేబుళ్ల విగ్నేష్, సుమతి, పాఠశాల చైర్మన్ కాంతి గంగారెడ్డి, డైరెక్టర్ శశాంక్‌పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు దుప్పట్ల పంపిణీ

బోధన్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కూలీలకు సోమవారం లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ఆధ్వర్యంలో పంట పొలాల్లో పనులు చేస్తున్న నిరుపేద కూలీలకు దుప్పట్లు, రగ్గుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొత్త బస్టాండ్, రైల్వే స్టేషన్ ప్రాంతాలలో యాచకులకు రగ్గులు, దుప్పట్లను పంపిణీ చేశారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో నిరుపేదలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారి సంక్షేమం కోసం దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఆచన్‌పల్లి ప్రతినిధులు మమ్మనేని రాజశేఖర్, సాంబిరెడ్డి, గణపతి రెడ్డి, శ్రీకాంత్, నాయిని కృష్ణ, లక్ష్మీకాంత్ రెడ్డి, శ్రీనివాసరావు, చక్రవర్తి, బలరాంరెడ్డి, దుర్గారావు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్మికులకు..

బోధన్ మున్సిపాలిటీ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు వేద పండితులు ప్రవీణ్ మహరాజ్ స్వెట్టర్లు, రగ్గులను పంపిణీ చేశారు. చలి తీవ్రత అధికంగా ఉండడంతో వేకువ జామున చలిలో విధులు నిర్వహిస్తున్నారని వీరు చేస్తున్న పనులకు మెచ్చుకుని అభినందించారు.

రైతులకు ఆయిల్ పామ్ సాగుపై శిక్షణ

మెండోర, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): మండలంలో బుస్సాపూర్ గ్రామంలో ఆయిల్‌ఫామ్ తోటలను ప్రీయునిక్ ఆయిల్‌ఫామ్ తోటలను కంపెనీ లిమిటెడ్ సిబ్బందితో కలిసి బాల్కొండ డివిజనల్ ఉద్యాన అధికారి రుద్రవినాయక్, పామ్‌ఆయిల్ కంపెనీ ఏరియా మేనేజర్ కరుణాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి పంట మార్పిడి చేసి ఆయిల్‌ఫాం, తోటలను పంచుకుంటే లాభాల బాటలో నడువచ్చునని పంట మార్పిడి చేసి ఆయిల్‌ఫాం తోటలను సాగు చేస్తే ఆ తోటల్లో అంతర్ పంటలుగా కూరగాయలు ఇతర పంటలను పండించుకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. పంట నిర్వహణలో భాగంగా అంతర పంట వేసుకున్న రైతులకు మొక్క దగ్గర వరకు దున్న కూడదు అని సమయానికి ఎరువులు, మొక్క సరిపడ తేమ ఉంచాలని రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు జైడి సాయన్న, కొప్పల గంగాధర్, కోమన్‌పల్లి సాయన్న, జక్కుల శ్రీనివాస్, ఏలేటి శ్రీనివాస్, పసుల నర్సయ్య, గొలింద్ల రాజేందర్, గోజూరు గంగాప్రసాద్, తూర్పు సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లన్న ఆశయ సాధనకు పాటుపడుదాం

భీమ్‌గల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజాపంథా నేత అమరజీవి కామ్రేడ్ ఎల్లన్న ఆశయ సాధనకు ప్రతీఒక్కరు పాటుపడతామని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో ఎల్లన్న 34వ వర్ధంతి సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎల్లన్న గ్రామీణ ప్రాంతంలో అనేక రైతాంత పోరాటాలు నిర్వహించి విప్లవ పోరాట యోధుడు అని విప్లవస్ఫూర్తితో ఆయన ఆశయ సాధనకు పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ భీమ్‌గల్ మండల కార్యదర్శి రాజేశ్వర్, ఆర్మూర్ డివిజన్‌నాయకులు జిల్కర నడ్పి నర్సన్న, దామోదర్, బాబన్న, సాయిరెడ్డి, రమేష్, అంబిక, గంగాధర్, ఆశిష్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

సొసైటీల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలి

● డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి



గోదాం నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి

రెంజల్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): రైతులు తమపంటలకు అవసరమైన నాణ్యమైన ఎరువులను సొసైటీల వద్దనే కొనుగోలు చేయాలని ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బోర్గాం గ్రామంలో 250మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణ పనులకు జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేటు ఫర్టిలైజర్ల వద్ద ఎరువులను కొనుగోలు చేయవద్దని, రైతులకు నాణ్యమైన ఎరువులు అందాలంటే అది సొసైటీల ద్వారానే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఎరువులను సొసైటీలల్లోనే కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు నాణ్యమైన మందులు, పెస్టిసైడ్ మందుల కోసం ప్రైవేటు దుకాణాలకు వెళ్లకుండా సొసైటీల వద్దనే కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపాలన్నారు. యాసంగిలో ప్రతీ రైతు సొసైటీల్లోనే ధాన్యాన్ని విక్రయించి అధిక లాభాలు పొందాలని, మద్దతు ధరతో పాటు బోనస్ డబ్బులు కూడా వస్తాయి కాబట్టి దళారులకు ధాన్యాన్ని అమ్మి మోసపోవద్దని సూచించారు. బోర్గాం రైతుల సౌకర్యార్థం 250మెట్రిక్ టన్నుల గోదాంను నిర్మించామని, దీనిని ప్రతి రైతు సద్వినియోగం చేసుకుని ప్రైవేటు ఫెర్టిలైజర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేయకుండా ప్రభుత్వ సహకార సంఘాల్లోనే కొనుగోలు చేయాలని రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందుకే గోదాం నిర్మాణ పనులను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మొయినోద్దీన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబిన్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ బోధన్ నియోజకవర్గ అధ్యక్షుడు కార్తీక్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు గైని కిరణ్, బోధన్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ ధనుంజయ్, సొసైటీ కార్యదర్శి ఇంద్రసేన్, డైరెక్టర్లు ఖదీర్ పాషా, అగ్గు నారాయణ, సాయిలు, కాంగ్రెస్ నాయకులు రవి, ఎంఎల్ రాజు, చీరడి రవి, భూమారెడ్డి, సిద్ద సాయిలు పాల్గొన్నారు.

కమనీయం.. మల్లన్న దేవుడి కల్యాణం



భక్తి

బషీరాబాద్‌లో బోనాలతో యాదవ మహిళల ఊరేగింపు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండంలోని బషీరాబాద్ గ్రామ శివారులోని దూల గుట్టపై కొలువుదీరిన యాదవులు ఆరాధ్య దైవం మల్లన్న స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం గ్రామంలో యాదవసంఘాల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనం తరం దూల గుట్టపై కొలువైన మల్లన్న స్వామివారి కల్యాణోత్సవం, జాతరా ఉత్సవాలును ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గుకళాకారుల ఆధ్వర్యంలో మల్లన్నస్వామి, గొల్ల కేతమ్మ, భళజ మేడాలమ్మల కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యాదవ సంఘ అధ్యక్షుడు గణేష్, కార్యదర్శి దేవన్న ముకేష్, బైకాని మహేష్, చిన్నయ్య, నడ్పన్న, రామకృష్ణ, ఆశన్న, భూమన్న, రాజు, అబ్బాస్, సాగర్, సుమన్, ప్రశాంత్, దీక్షాస్వాములు, గ్రామసంఘ సభ్యులు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీ సేవ

పెర్కిట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నవనాథ సిద్దుల గుట్టపై సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సిద్దేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివాలయంలో సిద్దేశ్వరునికి, రామాలయం, దత్తాత్రేయ, అయ్యప్ప, ఎల్లమ్మతల్లి, హన్మాన్ ఆలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకిసేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ఓరుగంటి పోశెట్టి రాధ, చేపూర్ రమ్యకృష్ణ, గోజురుశ్రీనివాస్ సరిత వారి కుటుంబ సభ్యులు గుట్టపైకి విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పీసీ.గంగారెడ్డి, బొండ్ల ఆనంద్, చరణ్‌రెడ్డి, రవి, మల్లయ్య, ప్రశాంత్‌గౌడ్, కొంతం మురళీ, సిద్దులగుట్ట సేవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ స్థాపనకు రూ.2లక్షల 50 వేల విరాళం



చెక్కును అందజేస్తున్న ప్రమోద్ రెడ్డి దంపతులు

ఏర్గట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హనుమాన్ మందిర పునర్నిర్మాణంలో భాగంగా ఆలయం వద్ద ధ్వజస్తంభం స్థాపన ఏర్పాటుకు గ్రామానికి చెందిన బద్దం ప్రమోద్‌రెడ్డి దంపతులు 2 లక్షల 50 వేలు విరాళంగా అందజేశారు. ఈ చెక్కును సోమవారం ఆలయ కమిటీ, బద్దం వారి సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా బద్దం సంఘ సభ్యులకు బద్దం ప్రమోద్‌రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తొర్తిలో వీర హనుమాన్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు



తొర్తిలో భూమిపూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్తి గ్రామంలోని వీర హనుమాన్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు కాగా సోమవారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిగిన వెంటనే ఆలయానికి నిధుల మంజూరు ఇప్పించినందుకు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు శివన్నోల్ల శివకుమార్, కౌడ భూమేశ్వర్, బెజ్జారపు భాను, కుండ శేఖర్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

బోధన్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ మండలాల అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, మందర్నా రవి అన్నారు. సోమవారం సాలూర మండలంలోని హున్స గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.5లక్షలతో చేపట్టిన గ్రావెల్ రోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సౌకర్యార్థం గ్రామీణ రోడ్లకు గ్రావెల్ మంజూరు చేసిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి రైతుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని, రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారన్నారు. రైతులు పంట పొలాలకు వెళ్లేటప్పుడు ఇబ్బందులు కలగకుండా మొరం రోడ్లకు నిధులు మంజూరు చేస్తూ రైతుల కోసం రోడ్లు వేయిస్తున్నారన్నారు. రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ ఏఎంసీ చైర్మన్ అంకు సంధ్య దాము, వైస్ చైర్మన్ చీల శంకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్ధన్, సీనియర్ నాయకులు అల్లె రమేష్, గ్రామ రైతులు నాయకులు పల్లె గంగారాం, శంకర్, ఈరయప్ప మహరాజ్, వల్లకొండ, నాని, సాయిలు, సొసైటీ డైరెక్టర్లు శివ కుమార్, రాములు, మాధవరావు, సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో ఇందిరమ్మ సర్వే

భీమ్‌గల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఇళ్ళు లేని నిరుపేదలకు ఇళ్ల అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ పథకంలో భాగంగా అర్హులకు గుర్తించేందుకు మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం సిబ్బంది సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతీవార్డులో క్షేత్రస్థాయిలో వెళ్ళి ఇళ్ల లేని వారి జాబితాను గుర్తిస్తున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకంలో చేపట్టే ఈ సర్వే పాదర్శకంగా చేయాలని కమిషనర్ రామకృష్ణ సిబ్బందికి సూచించారు.

పల్లికొండలో పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

భీమ్‌గల్ రూరల్, డిసెంబరు 16 (ఆం ధ్రజ్యోతి): మండలంలోని పల్లికొండ గ్రామంలో ఇందిర మ్మ ఇళ్ల సర్వేను సోమవారం ఎంపీడీవో సంతోష్ కుమార్ పరిశీలించారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సర్వే చేసి లబ్ధిదారులను గుర్తించాలని, తప్పులు లేకుండా వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి కుటుంబ యాజమాని ఫోటో, అప్లోడ్ చేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్‌కు సూచించారు. గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

శివాలయంలో ఆరుద్ర నక్షత్ర పూజలు

ముప్కాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): శివుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం మార్గశిర మాసం, శుక్లపక్షం సోమవారం కావడంతో శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. శివుని జన్మ నక్షత్రం కావడంతో ఉదయం సూర్యోదయం నుంచి శివునికి అభిషేకాలు, అర్చనలు, పంచామృతాభి షేకాలు, తులసి దళాలు, బిల్వార్చన, పుష్పార్చన వంటి పూజలు నిర్వహించారు. ముప్కాల్ మండలం కొత్తపల్లి రాజరాజేశ్వర్ ఆలయంలో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు.

క్రీడల్లో మంచి ప్రావీణ్యం సంపాదిస్తూ జాతీయస్థాయికి ఎదగాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ప్రావీణ్యం సంపాదిస్తు జితతదీయస్థాయికి ఎదగాలని బషీరాబాద్ గ్రామ కాంగ్రెస్ నాయకులు అకాంక్షించారు. మండలస్థాయిలో మూడు రోజుల పాటు జరిగిన సీఎంకప్ క్రీడల్లో క్రీడాప్రతిభను కనబర్చి అన్ని ఇవెంట్లలో రాణిస్తు బహుమతులు గెలుచుకున్న బషీరాబాద్ ఉన్నత పాఠశాల క్రీడాకారులను మంగళవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు అభినందించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీరాముల మురళి, నాయకులు వెన్నెల దేవేందర్, సక్కరం నారాయణ, ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు పురుషుల, బాలికల ప్రాబబుల్స్ ఎంపిక

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం సీనియర్ సాఫ్ట్‌బాల్ పురుషులు, మహిళల ప్రాబబుల్స్ జట్టును ఎంపిక చేసినట్టు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి గంగామోహన్ తెలిపారు. జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులకు వచ్చేనెల మొదటి వారంలో శిక్షణ శిబిరం నిర్వహించి రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే తుది జట్టను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, సొప్పరివినోద్, కోచ్‌లు నరేష్, అనికేష్, సంజీవ్, మౌనిక పాల్గొన్నారు.

ఎలక్ట్రిసిటీ గోదాంలో చోరీ కేసు నమోదు

ఎల్లారెడ్డి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్ గోదాంలో దొంగతనం జరిగినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రానికి చెందిన ఎండి ఫారుక్ గత ఎనిమిది సంవత్సరాల నుండి ఎలక్ట్రిసిటీ డిపార్టుమెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం లాంటి పనులను కాంట్రాక్టు తీసుకొని చేస్తుంటాడు. ఈ పనులకు సంబంధించిన వస్తువులను అతని ఇంటి ముందు ఉన్న గోదాంలో ఉంచుతుండేవాడు. శనివారం రాత్రి గోదాంకు తాళం వేసి ఇంటికి వెళ్లి తిరిగి సోమవారం ఉదయం గోదాం వద్దకు వెళ్లి చూడగా తాళం పగులగొట్టి గోదాంలో ఉన్న ఎలక్ట్రిసిటీకి సంబంధించిన సుమారు 50 వేల విలువ చేసే వస్తువులు కనిపించకపోవడంతో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని ఎండీ ఫరూక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ముప్కాల్‌లో ప్రభుత్వ ఆస్పత్రి నిర్మించాలి

ముప్కాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మండల కేంద్రానికి మంజూరైన ప్రభుత్వ ఆసుపత్రి మండల కేంద్రంలో నిర్మించాలని మున్సిపల్ గ్రామ పరిరక్షణ సమితి సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత సంవత్సరం ముప్కాల్ మండల కేంద్రానికి ప్రభుత్వ ఆసుపత్రి మంజూరైనప్పటికీ ప్రభుత్వ స్థలం గుర్తించక పోవడంతో నిర్మాణ పనులు సాగడం లేదు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి మండల కేంద్రంలో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మించాలని కోరారు.



పోలీసులు అరెస్టు చేసిన కార్మిక సంఘాల నాయకులు

'మాజీ సర్పంచ్‌లు, కార్మిక సంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేయడం సరికాదు'

బోధన్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడంతో ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి సోమవారం తరలివెళ్తున్న తాజా, మాజీ సర్పంచ్‌లను, కార్మిక సంఘాల నాయకులను అరెస్టు చేయడం సరికాదని సర్పంచ్‌లు కోర్ప గంగాధర్, రావుబా గంగాధర్, ఖాజాపూర్ సర్పంచ్, కార్మిక సంఘాల నాయకులు మల్లేష్, పీడీఎస్‌యూ నాయకులు గౌతం అన్నారు. సోమవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్నారన్న సమాచారంతో సోమవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్టు చేసి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తప్పకుండా అమలు చేయాలన్నారు. మాజీ సర్పంచ్‌లకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదలచేయాలన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు: సీఐ

బోధన్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. బోధన్ బస్టాండ్ సమీపంలో ఆదివారం రాత్రి ఇద్దరు ఆకతాయిలు మద్యం తాగిన వారిని సోమవారం కోర్టులో పర్చగా కోర్టు సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రెండు రోజుల జైలుశిక్షతో పాటు కమ్యూనిటి సర్వీస్ పనిష్మెంట్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిందితులు చెత్త చెదారాన్ని తొలగించి రోడ్లు పరిశుభ్రంగా ఉండేలా పనులు చేపట్టాలన్నారు. ఇక నుంచి కొత్త చట్టాలు అమల్లోకి వచ్చాయని ఇక నుండి ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో పలువురిని ఆట పట్టిస్తున్న ఇద్దరు ఆకతాయిలను కోర్టులో హాజరుపర్చగా రెండు రోజుల పాటు న్యాయమూర్తి జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. ఆకతాయిలు బస్టాండ్‌ల వద్ద ఇతరులను తరచూ ఆట పట్టిస్తున్నారన్న ఫిర్యాదు మేరకు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించామన్నారు. ఇక నుంచి బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ఆకతాయిలు మహిళలు, ఇతరులను ఆట పట్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ధర్నాకు వెళ్లేందుకు అనుమతించాలి



ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న పంచాయతీ కారోబార్లు

కమ్మర్‌పల్లి, డిసెంబరు 16:(ఆంధ్రజ్యోతి) గ్రామ పంచాయతీ కార్మికుల, కారోబార్ల సమస్యల పరిష్కారం కోరుతూ 17 న బుధవారం హైదరాబాద్‌లో జేఏసి అధ్వర్యంలో నిర్వహింపతలపెట్టిన ధర్నాకు వెళ్లేందుకు అనుమతించాలని కమ్మర్‌పల్లి మండల పంచాయతీ కార్మికులు కరోబార్లు మంగళవారం మండలపంచాయితి అధికారి సదాశివ్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. తెలంగాణ గ్రాద్రమపంచాయితీ సిబ్బందిని పర్మినెంట్ చేస్తు వేతాలు పెంచాలని, జీవో 51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విదదానాన్ని రద్దు చేయాలని, కేటగిరి వారీగా వేతనాలు పెంచాలని, కారోబార్లకు, బిల్ కలెక్టర్‌లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలని, బకాయిలు వేతనాల చెల్లింపులో జరుగుతున్న జాప్యంపై చర్యలు తీసుకోవాలని తదితర డిమాండ్లతో జేఏసి పిలుపు మెరకు చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు గ్రామపంచాయితీ కార్మిక, కరోబార్ల సంఘం నాయకులు తెలిపారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో మండల కార్మికుల సంఘం అధ్యక్షుడు టీ రాజేశ్వర్, వెంకట రమణ, జి.మోహన్, భరత్ కుమార్, వి.రవీందర్, సురేష్, సిహెచ్ వాయు నరేందర్ పాల్గొన్నారు.

ఆలూర్‌లో పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆలూర్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆర్మూర్‌రూరల్, డిసెంబరు16(ఆంధ్రజ్యోతి): ఆలూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 1997-98 పదవ తరగతి విద్యార్థులు 26ఏళ్ళ తర్వాత ఒక చోట చేరి అనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఉత్సహంగా గడిపారు. తాము చదువున్న పాఠశాలకు తమవంతు సహకారాన్ని అందించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా తమకు విద్యబుద్దులు నేర్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు ముక్కెర విజయ్, మల్లయ్య, రామకృష్ణ, రాకేష్, నారాయణ, చిరంజీవి, గోపి, నరేందర్, గంగారెడ్డి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు 16(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏరియా ప్రధాన కార్యదర్శి నిఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌పై విచారణ జరిపించాలని, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయింబర్స్ మెంట్‌ను రాష్ట ప్రభుత్వం విడుదల చేయాలని, చలో అసెంబ్లీకి బయలు దేరుతున్న పీడీఎస్‌యూ నాయకులను రేవంత్‌రెడ్డి సర్కారు భయపడి పోలీసులతో అరెస్టు చేయించడం సిగ్గుచేటని, అరెస్టును కేసులతో విప్లవ నాయకులను ఆపలేరన్నారు. ఈ కార్యక్ర మంలో పీడీఎస్‌యూ నాయకులు సిద్దు, వినయ్, నితిన్, నిఖిల్, సింహాద్రి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఏబీవీపీ బోధన్ పట్టణ అధ్యక్షుడిగా శ్రీరామ్

బోధన్‌రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ బోధన్ పట్టణ అధ్యక్షులుగా శ్రీరామ్, వర్ని మండల అధ్యక్షులుగా పైసా వినోద్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఏబీవీపీ ఇందూర్ జిల్లా ప్రముఖ్ తలాండే ఈశ్వర్, ఇండ్ల సూర్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ.శ్రీరామ్ 2001నుండి ఏబీవీపీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడమే కాకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కోసం నిర్వహించిన సృజన టెక్నో ఫెస్ట్‌నో ఐదేళ్లుగా విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. శ్రీరామ్ నవీపేట ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో లెక్చరర్‌గా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఇందూర్ విభాగ్ నూతన కార్యవర్గంలో ఇద్దరికి స్థానం కల్పించిన విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేష్, విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్‌కు ఏబీవీపీ రాష్ట్ర వనవాసి సెల్ కన్వీనర్, ఏబీవీపీ బోధన్ శాఖ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

కిసాన్‌నగర్‌లో నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ముప్కాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండలం కిసాన్ నగర్ గ్రామంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో ప్రతీ మంగళవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ చైర్మన్ చాకులింగం తెలిపారు. మంగళవారం ఉదయం 10నుంచి 12గంటల వరకు ఈ శిబిరంలో కంటి పరీక్షలు నిర్వహించి మోతె బిందు ఉన్న వారిని గుర్తించి ఉచిత శాస్త్రచికిత్స చేస్తామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



యథేచ్ఛగా బట్టీ వ్యాపారం!

● నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీల నిర్వహణ ● బట్టీలకు ఉచిత విద్యుత్ వినియోగం ● ఇటుక తయారీ కోసం అక్రమంగా తరలిస్తున్న కలప, మట్టి
● బాల కార్మికులతో వెట్టి చాకిరీ ● మట్టి పని పేరిట రూ.కోట్లల్లో వ్యాపారం ● పత్తాలేని అధికారులు

భీమ్‌గల్‌రూరల్, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ఇటుక బట్టీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. ఇటుక బట్టీల ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తమ వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారు. ఇటుక బట్టీ వ్యాపారులు వాల్టా చట్టానికి తూట్లు పడుస్తూ తమ వ్యాపారానికి అడ్డు వస్తున్న అధికారులకు మామూళ్లు ముట్టచెప్పి కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారు. మండలంలో 15 నుంచి 20 వరకు ఇసుక బట్టీలు ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్నాయి. నిబంధనలు ప్రకారం బట్టి ఏర్పాటు చేయాలంటే భూమి యజమాని అభ్యంతరం లేదని ధృవీకరణ పత్రం తహసీల్దార్ నుంచి తీసుకోవాలి. అలాగే ఇటుక బట్టి పెట్టాలంటే వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్చి పర్మిషన్ తీసుకొని బట్టిని ఏర్పాటు చేసుకోవాలి. అలాగే అన్నదాతలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుండగా వ్యాపారులు ప్రత్యేకంగా బోరు వేసుకొని మోటార్ నడుపుకునేందుకు కరెంటు అధికారులకు దరఖాస్తు చేసుకొని కనెక్షన్ పొందాల్సి ఉంటుంది. దీనికి మూడు నెలలకు సుమారు రూ.25 వేలు కట్టాలని నిబంధన ఉంది. దీనికి విరుద్ధంగా బట్టీలకు దగ్గర ఉన్న వ్యవసాయ భూముల్లో ఉన్న బోరు మోటార్‌ను లీజుకు తీసుకొని ఉచిత విద్యుత్‌ను దుర్వినియోగం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే రెవెన్యూ, లేబర్, భూగర్భగనుల, విద్యుత్, రవాణ, ఇరిగేషన్, అటవీ, పంచాయతీ తదితర శాఖల అధికారుల అనుమతి తీసుకోవాలి. కానీ ఇటుకబట్టీల యజమానులు ఇవేమీ పాటించకుండా అన్నిశాఖల అధికారులను మచ్చిక చేసుకొని తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరుకాయలు అన్నచందంగా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు.



యథేచ్ఛగా చెట్ల నరికివేత..

బట్టీలో ఇటుకలు కాల్చేందుకు యథేచ్ఛగా చెట్లను నరికి బట్టీలకు తరలిస్తున్నారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి మొక్కలు నాటితే ఒకవైపు చెట్లను నరికి బట్టీలకు అక్రమంగా రవాణా చేస్తున్న అటవీ అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే చెరువుల నుంచి వ్యవసాయ భూముల నుంచి మట్టిని అక్రమంగా బట్టిలకు తరలిస్తూ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు. తమ వ్యాపారులు బట్టీలో పనిచేసే కార్మికులను బిహార్, అస్సాం, మహారాష్ట్రల నుంచి తెప్పించుకొని లెబర్ యాక్టు ప్రకారం జీతాలు ఇవ్వకుండా శ్రమదోపిడి చేస్తున్నారు. కూలీలా పిల్లలను సైతం వెట్టిచాకిరి చేయిస్తున్నారు. ఎవరైనా చూస్తే మట్టి పనిలా కనిపిస్తున్న ఇటుక బట్టిల యాజమానులకు కోట్ల రూపాయల ఆదాయం వస్తోంది. మండలంలో పెద్దఎత్తున తతాంగం నడుస్తున్న భూగర్భ గనుల శాఖ అధికారులు పత్తా లేకుండా పోయారు. సంబంధిత అధికారులు పట్టించుకోపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి పెద్దఎత్తున గండి పడుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి మండలంలో ఎటువంటి అనుమతులు లేకుంటే వెలిసిన ఇటుక బట్టీలను, సీజ్ చేసి నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అనుమతి తీసుకోకుంటే క్రిమినల్ కేసులు

● మహమ్మద్ షబ్బీర్, తహసీల్దార్, భీమ్‌గల్



మండలంలో ఇటుక బట్టీలకు అనుమతి ఇవ్వలేదని నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా నడుస్తున్న బట్టీలను గుర్తించి వ్యాపారులపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. మైనింగ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలని లేకుంటే వాట్ల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

డీడీలు కట్టి కరెంటు కనెక్షన్ తీసుకోవాలి

● రూప్‌సాయి, విద్యుత్ డీఈ



మండలంలో నడుస్తున్న ఇటుక బట్టీల యజమానుల నుంచి ఇప్పటివరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. మేము ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. బట్టి యజమానులు రైతుల బోరు మోటార్‌లు వాడొద్దు. డీడీ కట్టి కరెంటు కనెక్షన్ తీసు కోవాలి. రైతులకు సంబంధించిన ఉచిత విద్యుత్‌ను వాడితే క్రిమినల్ కేసులను నమోదు చేస్తాం.

వాల్టా చట్టం ప్రకారం కేసుల నమోదు

● దేవిదాస్, ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్



అడవి నుంచి అక్రమంగా చెట్లను నరకడం నేరం. చెట్లను నరకడం, ఇటుక బట్టీలకు తరలించడం చేస్తే వాల్టా చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తాం. రైతుల పొలంలో పెంచిన చెట్లు నరకాలంటే తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే వాటిని పరిశీలించి సైజును బట్టి రుసుము కడితే అనుమతి ఇస్తాం.



భక్తి

మల్లన్నస్వామికి ఆలయంలో నైవేద్యాలు వేసేందుకు బారులు తీరిన భక్తులు

వైభవంగా అంక్సాపూర్ సంతమల్లన్న జాతర

● భక్తిశ్రద్ధలతో రథోత్సవం ● వేలాదిగా తరలివచ్చిన మల్లన్న భక్తులు
● అన్ని ఏర్పాట్లు చేసిన ఆలయ, గ్రామాభివృద్ధి కమిటీలు

వేల్పూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ సబ్ డివిజన్‌లో అత్యంత ప్రచూర్యం పొందిన వేల్పూర్ మండలం అంక్సాపూర్ సంత మల్లన్న జాతర, రథోత్సవం సోమ వారం అంగరంగా వైభవంగా సాగింది. ఈ సందర్భంగా బంతిపువ్వులతో ఒకరు భయంకరమైన వేషధారణ (పోతరాజు)తో వచ్చి రథం(షిడే) ముందు మంత్రలు ఉచ్చరిస్తూ మేక గొర్రె పిల్లలను నోటితో గావుపట్టడం, రంగురంగు పూలతో అందంగా అలంకరించిన రథాన్ని (షిడే) సువిశాలమైన గుట్టదేవాలయం చుట్టూ తాళ్ల సహాయంతో వేలాదిమంది భక్తులు ఐదుసార్లు తిప్పడం ఈ జాతరలో ప్రత్యేకంగా సంతరించుకుంది. సంతమల్లన్న గ్రామాభివృద్ధి కమిటీ, దేవాలయ కమిటీలు సంయుక్తంగా నిర్వహించిన ఈ జాతరలో వేలాది మంది వేల్పూర్ మండల గ్రామాలతోపాటు ఆర్మూర్ డివిజన్‌లోని వివిధ మండలాల గ్రామాల నుంచి తరలివచ్చి సంత మల్లన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చు కున్నారు. అంతేగాకుండా ఇతర జిల్లాలైన కరీంనగర్, ఆదిలాబాద్‌ల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి సంతమల్లన్న స్వామికి పూజలతో మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు వచ్చిన వేలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అంక్సాపూర్ గ్రామాభి వృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అన్నిరకాల సౌకర్యా లు కల్పించారు. ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరుగకుండా ఆర్మూర్ డీఎస్పీ వెంకటేశ్వర్‌రెడ్డి, రూరల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై నాగనాథ్ ఆధ్వర్యంలో రూరల్ పరిధిలోని పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది సేవలందించారు. కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీసభ్యులు, సంతమల్లన్న భక్తులు పాల్గొన్నారు.



అంక్సాపూర్ సంతమల్లన్న జాతరలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు



నైవేద్యాల బోనంతో రథం చుట్టూ తిరిగి సమర్పిస్తున్న సంతమల్లన్న భక్తులు

భిక్కనూరుకు చేరుకున్న గోరక్ష మహా పాదయాత్ర



జంగంపల్లిలో గురుస్వామిని సన్మానిస్తున్న దృశ్యం

● గ్రామగ్రామాన హారతులతో స్వాగతం

భిక్కనూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి గోవుతో చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర సోమవారం ఉదయం భిక్కనూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా జంగంపల్లి, బీటీఎస్, అంతం పల్లి, భిక్కనూరు, సిద్దరామేశ్వరనగర్, బస్వాపూర్ గ్రామాల ప్రజలు, భిక్కనూరు అయ్యప్ప స్వాములు హారతులతో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాల కృష్ణ గురుస్వామి మాట్లాడుతూ సెప్టెంబరు 27న ప్రారంభమైన గోరక్ష మహా పాదయాత్ర మార్చి25 2025 వరకు 14 రాష్ట్రాల మీదుగా 180 రోజులు, 4900 కిలో మీటర్లు కొనసాగుతుందన్నారు. ప్రతీఒక్కరు ఈ యాత్ర విజయవంతానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో భిక్కనూరు అయ్యప్ప స్వాములు, ప్రజలు పాల్గొన్నారు.

ఫొటో న్యూస్



చెరువు వద్ద సైబీరియన్ పక్షులు

నవీపేటలో కనువిందు చేస్తున్న సైబీరియన్ పక్షులు

నవీపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని దర్యాపూర్ శివారులో సైబీరియన్ పక్షులు సందడి చేస్తున్నాయి. దర్యాపూర్ చెరువు ప్రాంతానికి వచ్చిన ఈ పక్షులను స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. సైబిరియా, ఉత్తర యురేషియా నుంచి ఈ సైబీరియా పక్షులు వలస వస్తుంటాయి. సైబీరియా పక్షులు ఇక్కడే చెట్ల మీద నివాసం ఏర్పచుకుని గుడ్లు పెట్టి అవి పొదిగిన అనంతరం తమ పిల్లలతో స్వస్థలాలకు తిరిగి వెళ్తుంటాయని నవీపేట వెటర్నరీ వైద్యుడు నరేందర్ పేర్కొన్నారు.



జేసీబీతో పొదలను తొలగిస్తున్న దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చెట్లపొదలను తొలగించిన అధికారులు

పెర్కిట్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలోకి వెళ్లే రోడ్డు పక్కన గల డ్రైనేజీ, చెట్లపొదలను అధికారులు తొలగించారు. డ్రైనేజీలో చెట్లపొదలతో పారిశుధ్య సమ్యలు ఎదురవడటంతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచూరితమైన 'అధ్వానంగా డ్రైనేజీ' కథనానికి స్పందించారు. మున్సిపల్ సిబ్బంది ద్వారా చెట్లపొదలను, చెత్తను జేసీబీ సహాయంతో తొలగించి శుభ్రంచేశారు. ఫంక్షన్‌హాల్ పక్కనే ఉన్న చెత్తకుప్ప, ప్లాస్టిక్ వ్యర్థాలను సైతం తొలగించారు. ఎప్పటికప్పుడు చెత్తను మున్సిపల్‌వాహనంలో వేయాలని ఫంక్షన్‌హాల్ యాజమానికి అధికారులు ఆదేశించారు.



డ్రైనేజీలోని చెత్త, చుట్టుపొదలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది



డిచ్‌పల్లి ఠాణాలో అరెస్ట్ అయిన పీడీఎస్‌యూ నాయకులు

వర్సిటీలో పీడీఎస్‌యూ నాయకుల ముందస్తు అరెస్టు

డిచ్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తెలంగాణ వర్సిటీ పీడీఎస్‌యూ నాయకులను సోమవారం ముందస్తుగా అరెస్ట్ చేసి డిచ్‌పల్లి ఠాణాకు తరలించారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో రవీందర్, అక్షయ్, రాకేశ్ ఉన్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం నిర్వీర్యం చేస్తోందని, తరుచూ ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రిని నియమించకపోవడం శోచనీయమన్నారు. వర్సిటీలకు అందాల్సిన స్పెషల్ గ్రాంట్‌లు విడుదల చేయడం లేదని, ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను వెంటనే భర్తీచేయాలని వర్సిటీ విద్యార్థులకు నెలకు 2వేల పెలోషిప్ ఇవ్వాలన్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వర్సిటీ నాయకులను జిల్లా పీడీఎస్‌యూ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ ఖండించారు.

బాధిత కుటుంబానికి నగదు అందజేత

డిచ్‌పల్లి, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లిలో గ్రామవాసి 10రోజుల కింద గల్ఫ్‌లో మృతి చెందడంతో ఆయన కుటుంబానికి గ్రామ యువజన సంఘాల సభ్యులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పానుగంటి సతీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో రూ.62,300 భార్య రాజమనికి అందజేసి తమ ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో యువజన సంఘాల సభ్యులు వినోద్ రెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వావలంబనకు మెప్మా అండ

చిన్నరుణాలతో మహిళలకు భరోసా

భీమ్‌గల్,డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రాలు మున్సిపాలిటీలో నివాసించే బడుగు, బలహీన వర్గాల పేదరిక నిర్మూలించి ఆర్థికంగా ఆదుకునేందుకు మహిళలకు వీధి విక్రయ దారులకు ప్రభుత్వం పట్టణ పేదరికం నిర్మూలన సంస్థ (మెప్మా) ద్వారా మైక్రోరుణాలను అందజేస్తూ వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తూ మహిళ ఆర్థిక ప్రగతికి తోడ్పడుతోంది. 2007లో అప్పటి ఉమ్మడిరాష్ట్రంలో ప్రవేశపెట్టిన ఈపథకం ద్వారా పట్టణ ప్రాంతాలలోని మహిళలకు స్వయంఉపాధిని కల్పిస్తూ వారికిదారి చూపుతోంది.



మహిళా సంఘాలకు బ్యాంకురుణాల చెక్కులను అందజేస్తున్న మెప్మా సిబ్బంది

మెప్మా విధులు

పట్టణ కేంద్రాలలోని మున్సిపల్ కార్యాలయాలకు అనుసంధానంగా పనిచేస్తున్న మెప్మా సమైక్యగా ఏర్పడి ఆర్పీలను నియమిస్తోంది. వీరు ప్రతీ 10 మందికి ఒక గ్రూపును ఏర్పాటు చేస్తూ ఉపాధి కోసం బ్యాంకులు నుంచి మైక్రో రుణాలను గ్రూపుల వారీగా అందజేస్తారు. ఇందుకు ప్రతీనెల ఏర్పడిన సంఘాలతో సమావేశం నిర్వహించి స్వయం ఉపాధి కోసం చేపట్టాల్సిన వాటిపై అవగాహన కల్పిస్తూ తీసుకున్న రుణాలను ప్రతీనెలా విడతల వారీగా బ్యాంకుకు చెల్లించే విధంగా చూస్తోంది. వీటితోపాటు మహిళా సంఘాలలోని సభ్యులకు వీధి విక్రయదారులు నిర్వహించే పెద్ద వ్యాపారాలకు స్త్రీనిధి ద్వారా వ్యక్తిగత రుణాలు కూడా అందజేస్తూ మహిళకు అండగా నిలుస్తోంది. భీమ్‌గల్ మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా సమైఖ్యాలో 320సంఘాలు ఉన్నాయి. ఇందులోని 3200మంది మహిళలు గ్రూపు రుణాలు మహిళలు స్త్రీనిధి రుణాలు తీసుకొని చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారు. స్త్రీనిధి ద్వారా తీసుకున్న వ్యక్తిగత రుణాలతో కూడా ఆ కుటుంబం పెద్ద వ్యాపారాలను చేపడుతూ ఉపాధికి బాటలు వేసుకుంటున్నారు.

ఈ ఏడాది లక్ష్యం

2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.7కోట్ల 39 లక్షల గ్రూపు అందించాల్సిన మెప్మాకు ఉంది. ఇప్పటివరకు వందశాతం రుణాలను అందజేశారు. ప్రస్తుతం భీమ్‌గల్ పట్టణ కేంద్రంలో ఈ ఆర్థిక సంవత్రంలో వెయ్యిమందితో వంద సంఘాలను పూర్తిచేయాలని లక్ష్యం ఉండగా ఇందులో మెప్మా సిబ్బంది కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలలో భాగంగా 21మహిళా సంఘాలకు రూ.కోటి 85 లక్షలు, 35మంది వీధి విక్రయాదారులకు 25లక్షల రుణాలను అందించారు. అలాగే ప్రత్యేకంగా మహజిళా శక్తి ద్వారా 34లక్షల పైగా రుణాలు అందించి ప్రోత్సహిస్తున్నారు.

రుణాలు అందజేసి ఉపాధి కల్పిస్తున్నాం..

● రామకృష్ణ, మున్సిపల్ కమిషనర్



భీమ్‌గల్ మున్సిపల్ పట్టణ కేంద్రంలో మహిళా సంఘాల అభివృద్ధికి మెప్మా ద్వారా బ్యాంకుల నుంచి రుణాలను అందజేసి వారికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. ఆర్పీల పర్యవేక్షణలో వారు తీసుకున్న రుణాలతో ఆర్థిక ప్రగతి సాధించేందుకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహిస్తున్నాం.

రుణం తీసుకొని దుకాణం నడుపుతున్నా

● చిలివేరి సునీత, భీమ్‌గల్

మెప్మా ద్వారా మహిళా సంఘాల ద్వారా తీసుకున్న రుణంతో దుకాణం పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నాను. దీని ద్వారా వచ్చే ఆదాయంతో ఉపాధి పొందుతున్నాను.



గడ్కోల్లో ఎల్లన్న స్మారక సభలో మాట్లాడుతున్న ఆకుల పాపయ్య

కష్ట జీవుల రాజ్యం కోసం పోరాడిన ఎల్లన్న

● సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి

సిరికొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పేదల ఇంట్లో పుట్టి పేదల రాజ్యం కోసం పోరాడిన నాయకుడు ఎల్లన్న అని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు. మండలంలోని గడ్కోల్ గ్రామంలో సోమవారం జరిగిన ఎల్లన్న 33వ వర్ధంతి సమావేశానికి ఆకుల పాపయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామంలో ఎర్రన్న జండాను ఆవిష్కరించిన అనంతరం జరిగిన సమావేశంలో పాపయ్య మాట్లాడుతూ.. పుట్టుక చావు సహజమే కానీ.. తన చుట్టూ ఉన్న సమాజం కోసం ఆలోచించి పనిచేయడం హిమాలయాల కన్న ఉన్నతమైనదని అని ఆయన అన్నారు. న్యూడెమోక్రసీలో నాయకుడుగా ఎదిగి ప్రజలను ఐక్యం చేసి పోరాటాలు చేసి ప్రజల్లో పేరు సంపాదించుకున్నాడని అన్నారు. కష్టజీవుల రాజ్యం కోసమే పనిచేస్తున్నామని ప్రకటించుకున్న ఆనాటి పీపుల్స్‌వార్ పార్టీ.. తప్పుడు సమాచారంతో ప్రజా ఉద్యమాలకు నాయకత్వం వహిస్తున్న ఎల్లన్నను భీమ్‌గల్ పట్టణంలో కాల్చి చంపిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వి.భూమయ్య, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆర్మూర్ డివిజన్ కార్యదర్శి పద్మ, సబ్‌డివిజన్ కార్యదర్శి బాలయ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి సూర్య శివాజీ, అరుణోదయ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్దుల్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి వి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల కోసం 'డీఎస్పీ' పోరాటం



ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న డీఎస్పీ నాయకులు

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యతరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ ఎస్టీ ప్రజల హక్కుల కోసం డీఎస్పీ పోరాటం చేస్తుందని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మహరాజ్, జిల్లా అధ్యక్షుడు మహిపాల్ మహరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద సోమవారం డీఎస్పీ ఆధ్వర్యంలో సుమన్ మహిపాల్‌లు ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యాన్ని అందించాలన్నారు. అర్హులైన వారందరికీ సాగునీటి సౌకర్యంతో ఎకరం వ్యవసాయ భూమిని ఇవ్వాలన్నారు. ఐదు డిమాండ్లతో నెలరోజుల నుంచి వివిధ దశల్లో ఉద్యమాలు చేస్తున్నా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. అందుకే ఆమరణ నిరాహార దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించేవరకు మా పోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు ప్రేమ్‌కుమార్, జిల్లా నాయకులు ప్రశాంత్, మురళి, సుభాష్, గంగాధర్, మహేష్, కైలాశ్, నిశాంత్, అశోక్‌గౌడ్, గంగాధర్, లింగన్న, తదితరులు పాల్గొన్నారు.

బహుజన కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా దండి వెంకట్

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): బహుజన లెఫ్ట్ పార్టీ అధ్యక్షుడిగా దండి వెంకట్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన రాష్ట్ర ప్రథమ మహాసభలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దండివెంకట్, ప్రధాన కార్యదర్శిగా సిద్ధిరాములును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. నూతన రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన దండివెంకట్, సిద్ధిరాములు బహుజన శ్రామిక వర్గ వృత్తి కులాలకు చెందిన వడ్డెర, పద్మశాలిల నాయకత్వంలో మార్క్సిజం అంబేద్కరిజం ఆలోచన విధానాలతో ఇతర సాంప్రదాయ కమ్యూనిస్టు పార్టీలకు భిన్నంగా ఇండియా తరహా మార్క్సిజం అంబేద్కరిజం అన్వయింపుతో కూడిన కులవర్గీకరణ జమిలి సైద్ధాంతిక రాజకీయ కార్యక్రమం ద్వారా పనిచేస్తున్న బీఎల్‌పీని బలోపేతం చేస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. బీఎల్‌పీ తెలంగాణ రాష్ట్ర కమిటీ గౌరవ అధ్యక్షులుగా నల్ల సూర్యప్రకాశ్, ఉపాధ్యక్షురాలిగా సబ్బనిలత, ఆంజనేయులు, శ్రీశైలం, కార్యదర్శులుగా ఎం.ఎం.గౌడ్, వడ్ల సాయికృష్ణ, సహాయ కార్యదర్శిగా ఎల్లయ్య, రాష్ట్ర కోశాధికారిగా మారోజు సునీల్, రాష్ట్ర కమిటీ సభ్యులుగా జగదీశ్, గంగాశంకర్, రాజేందర్, జ్యోతి, సయ్యద్, గంగామణి, చాట్ల పోచవ్వ, మహమ్మద్, అరుణ, అజయ్, హరి, రాజులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

బైకు ఆదుపు తప్పి వ్యక్తి మృతి

డిచ్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని సాంపల్లి గ్రామానికి చెందిన జంగయ్య (55) ఆదివారం డిచ్‌పల్లి నుంచి సాంపల్లికి వెళ్తుండగా బైకు అదుపు తప్పి పడిపోవడంతో బైకుపై ఉన్న జంగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్సై షరీఫ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు ఎస్సై తెలిపారు.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించి, ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ.10వేల వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో 48గంటల నిరసన దీక్షకు నిర్వహించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్నాచౌక్ వద్ద దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐటీయూ కార్యదర్శి నూర్జహాన్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి, లక్ష్మిలు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చే గౌరవ వేతనం, విద్యార్థులకు ఇచ్చే మెనూ చార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నెలల తర బడి బిల్లులు రాకపోవడంతో అప్పులు చేసి ప్రభుత్వానికి ఎదురు పెట్టుబడి పెట్టి వంట చేసి పెడుతున్నామన్నారు. దీంతో కార్మి కులు అప్పులపాలు అవుతున్నారని అన్నారు. తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. గతంలో చేసిన వాటికి బిల్లులు రాలేదని పైగా రాగిజావ పోయాలి, బిల్లులు రాకపోయినా పిల్లలకు వండి పెట్టాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకొని వెంటనే పెండింగ్ బిల్లులు క్లియర్ చేయాలని కోరారు. పెరిగిన వేతనం కొన్ని జిల్లాల్లో కొన్ని మండలాల్లో మాత్రమే ఇచ్చారని ప్రతీనెలా సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్ పాత మెనూకే సరిపోవడం లేదన్నారు. మెనూ చార్జీలు పెంచాలని కార్మికుల పెండింగ్ జీతాలను వెంటనే విడుదల చేసి కార్మికుల వ్యక్తిగత ఖాతాల్లోనే వేయాలన్నారు. వారానికి 3 కోడిగుడ్లు పెట్టాలని, రాగిజావ పోయాలని ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. గుడ్డుకు కేటాయించిన బడ్జెట్ రెండుగుడ్లకే సరిపోవడం లేదని మూడు గుడ్లు ఎలా పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు నస్రీసాబ్, సుజాత, సుదర్శన్‌రెడ్డి, హరిశంకర్, శ్రీనివాస్, శేఖర్, శిరీష, శివకళ, జయమ్మ, మల్లమ్మ, సాయమ్మ, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండ గంగాధర్, ఐద్వా జిల్లా కార్యదర్శి సుజాత పాల్గొన్నారు.

గోర్ బంజారా ఆధ్వర్యంలో బ్యాడ్మింటన్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

సుభాష్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గోర్ బంజారా అసోసియేషన్ ఆధ్వర్యంలో గోర్ బంజారా మాస్టర్స్ బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో బంజారా సమాజం నుంచి క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ హరికృష్ణ హాజరై మాట్లాడారు. ఇలాంటి క్రీడలను ప్రోత్సహించే కార్యక్రమాలు చేయడం వల్ల సమాజానికి మంచి సందేహం వెళ్తుందన్నారు. ముఖ్యంగా యువతకు క్రమశిక్షణ, ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగేందుకు దోహదపడు తుందన్నారు. ఇందూరు జిల్లాలోనే కాకుండా రాష్ట్రంలో బంజారా మాస్టర్స్ క్రీడలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు ప్రతీ సంవత్సరం నిర్వహిస్తుండాలని తెలిపారు. కళలను, క్రీడాకారులను ఎల్లప్పుడూ ప్రోత్సహించడం ద్వారా సమాజం ఎప్పుడూ ఐకమత్యంతో ఉండే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ప్రకాశ్, టిజిఎన్‌పిడిసిఎల్ ఏఈ గంగారాం, ప్రతాప్‌సింగ్, దేవిసింగ్ తదితరులు పాల్గొన్నారు.



మిట్టపల్లిలో సంతమల్లన్న స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

వైభవంగా సంత మల్లన్న జాతర

డిచ్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపల్లిలో సోమవారం గొల్లకుర్మ సంఘం ప్రతినిధులు సంత మల్లన్న జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ఊరేగించారు. ఆలయ నిర్వాహకులు ఒగ్గుపట్నం వేసి దేవుని కల్యాణం నిర్వహించారు. అనంతరం విగ్రహాలను గ్రామ వీధుల గుండా డోలు వాయిద్యాలతో ఆలయం వరకు చేరుకున్నారు. మహిళలు మంగళ హారతులతో దేవత మూర్తులకు స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కల్యాణం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

బాధ్యతల స్వీకరణ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో బాపూజీ వచనాలయ కార్యదర్శిగా గెలుపొందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మీసాల సుధాకర్‌రావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హుందాన్ హాజరై ఆయనను అభినందించారు. అనేక సంవత్సరాల నుంచి బాపూజీ వచ నాలయానికి సేవ చేస్తున్నారని ఆయన కార్యదర్శిగా ఎన్నిక కావడం గొప్ప విషయమన్నారు. నుడా చైర్మన్ కేశవేణు, రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, గ్రంథాలయ చైర్మన్ అంతరెడ్డి రాజారెడ్డి తదితరులు మీసాల సుధాకర్‌రావును అభినందించారు. ఈ కార్యక్రమంలో బాపూజీ వచనాలయ చైర్మన్ భక్తవత్సలం, కోశాధికారి గంగాధర్, ఉపాధ్యక్షులు దేవిదాస్, అశోక్, బంటు రాజేశ్వర్, బాలకృష్ణ, దిగంబర్ పవార్, గంగారెడ్డి, సాంబయ్య పాల్గొన్నారు.

సహజ యోగా చైతన్య రథ యాత్ర

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరమ పూజ్య మాతాజీ నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహజ యోగా చైతన్య రథయాత్ర సోమవారం నగరంలోని పలు వీధులగుండా సాగింది. జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన సహజ యోగా చైతన్య రథయాత్రలో యోగా, ధ్యాన పద్ధతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు దైవనందిత జీవితంలో ఇంటా బయట అనేకమైనటువంటి పని ఒత్తిడితో శ్రమవలన ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని యోగా, ధ్యానం ద్వారా ఆ సమస్యలను అధికమించవచ్చని శిక్షకులు వివరించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వినోద్, వినయ్, ప్రమోద్, సునీల్ అగర్వాల్, జిల్లా కోఆర్డినేటర్ నాగభూషణచారి, జిల్లా కమిటీ సభ్యులు భూమారెడ్డి, మన్మోహన్, మల్లేష్‌రెడ్డి, గంగారాం, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు



నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పరమపవిత్రమైన ధనుర్మాస ఉత్సవాలు శ్రీవైష్ణవ ఆలయాల్లో సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. శ్రీవైష్ణవ ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాన్ని పురస్కరించుకొని కొలువుదీరిన దేవతలకు పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవికి అష్టోత్తర శతనామాలతో విశేష పూజలు జరిపారు. గోదాదేవి అందించిన తిరుప్పావై పాశురాలతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ వైష్ణవమైన జెండా బాలాజీ మందిర్, చక్రంగుడి వెంకటేశ్వర స్వామి ఆలయం, సుభాష్‌నగర్ రామాలయం, ఆర్యనగర్ వెంకటేశ్వర స్వామి ఆలయం, అపురూప వెంకటేశ్వర స్వామి ఆలయం, నర్సింగ్‌పల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం, తదితర ఆలయాల్లో ధనుర్మాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఇందూరు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇందూరు విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేష్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద విద్యార్థి సంఘం ఏబీవీపీ అని వ్యక్తి నిర్మాణం ద్వారానే జాతీయ పునఃనిర్మాణం సాధ్యమనే ఉద్దేశ్యంతో పనిచేస్తున్న విద్యార్థి సంఘం ఏబీవీపీ అన్నారు. ఏబీవీపీ దేశభక్తులను తయారు చేసే కర్మాగారం అని వివేకానందుని స్ఫూర్తితో అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేస్తున్న ఏకైక సంఘం ఏబీవీపీ అన్నారు. డిసెంబర్ 23, 24, 25 తేదీల్లో సిద్ధిపేటలో జరుగనున్న 43వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజశేఖర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు శికుమార్, శశి, జగన్మోహన్‌గౌడ్, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

వ్యభిచార గృహంపై సీసీఎస్ పోలీసుల దాడి

ఖిల్లా, డిసెంబరు16 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాంగ్ర శివారులో ఓ వ్యభిచార గృహంపై సీసీఎస్ పోలీసులు దాడి చేసి పలువురిని అదుపులోకి తీసుకున్నారు. ఖచ్చితమైన సమాచారం మేరకు ఓ ఇంటిపై దాడి చేశారు. ఈ దాడిలో అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు మహిళలు, ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీసీఎస్ ఏసీపీ నాగేంద్ర తెలిపారు. కేసు నమోదుకు నాల్గోటౌన్ పోలీసులకు అప్పగించారు. తదుపరి విచారణ జరుపుతున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. ఇందులో సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



రోడ్డు ప్రమాదంలో మరణించిన రాములు

మోపాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కులాస్‌పూర్ గ్రామ శివారులో సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో దూస్‌గాం గ్రామానికి చెందిన రాములు (45) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. రాములు నిజామాబాద్ నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై తిరిగి వెళ్తుండగా అతనికి అతనే అదుపు తప్పి బండిపై నుంచి కిందపడిపోయి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చెరువులో పడి మహిళ..

మోపాల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యాల్‌కల్ గ్రామం మాసాని చెరువులో స్వప్న (38) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. న్యాల్‌కల్‌కు చెందిన స్వప్న తల్లిదండ్రులతో గొడవపడి ఈ అఘాయిత్యానికి పాల్పడిందని ఎస్సై తెలిపారు. ఇంట్లో ఎవరూ లేనిది చూసి స్వప్న గ్రామంలో ఉన్న మాసాని చెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. గొడవ జరిగిన రోజు ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంట్లో ఆరాతీశామని అప్పటి కూడా సమాచారం రాకపోవడంతో తోటి వారు చూసి చెరువులో పడి సమాచారం ఇచ్చినట్లు కుటుంబ సభ్యులు ఎస్సైకి వివరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పసుపు పంట విక్రయాలకు ఏర్పాట్లు

(ఐదో పేజీ తరువాయి)

అధికారులు పరిశీలిస్తున్నారు. రైతులు సరుకు ఎండబెట్టుకోవడానికి ప్లాట్‌ఫారంలను శుభ్రం చేస్తున్నారు. అన్ని చోట్ల విద్యుత్‌దీపాలను అమర్చుతున్నారు. తూకాలు వేయడానికి ఎలక్ట్రానిక్ మెషిన్లను మరమ్మతు చేయిస్తున్నారు.

రైతులకు అందుబాటులో విశ్రాంతిగదులు..

వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిర్మించిన రైతు విశ్రాంతి గదులను రైతులకు అందుబాటులో తెచ్చేందుకు వాటిని శుభ్రం చేయిస్తున్నారు. మహిళ రైతులకు ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. వాటిలో గల వసతులను మెరుగుపర్చుతున్నారు.

వ్యాపారులతో సమావేశం..

జనవరి నెల నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో పసుపు పంట లావదేవీలు ప్రారంభం కానున్నందున అధికారులు పసుపు కొనుగోలు చేసే వ్యాపారులతో సమావేశాలు నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు. ఇటీవల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ముప్పగంగారెడ్డి బాధ్యతలు చేపట్టిన అనంతరం రైతులకు ఎటువటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకునేందుకు ఈ సమావేశాన్ని ఆయన పర్యవేక్షణలో నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. రైతులకు ఎటువంటి మోసాలు చేయరాదని వారి వ్యాపార లావదేవీలు పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశించే అవకాశాలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో వ్యాపారాలు నిర్వహిస్తున్నందున నాణ్యమైన పసుపునకు గిట్టుబాటు ధర చెల్లించాలని సమావేశంలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఆన్‌లైన్ మోసాలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుని రైతులకు నమ్మకాన్ని భరోసాను కల్పించే దిశగా అధికారులు, సిబ్బంది, పాలకవర్గం కృషి చేయనున్నట్లు తెలిసింది.

క్రమశిక్షణతో విజయాలు సాధించవచ్చు

(ఐదో పేజీ తరువాయి)

పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. సోమవారం వాలీబాల్, బాస్కెట్‌బాల్, సెపక్‌తక్రా, తదితర అంశాల్లో పోటీలను నిర్వహించారు. మంగళవారం చెస్, సైక్లింగ్, బాక్సింగ్, నెట్‌బాల్, పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడల, యువజన శాఖాధికారి ముత్తన్న తెలిపారు. కాగా, జిల్లా స్థాయి క్రీడల నిర్వహణపై చైర్మన్ అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. క్రీడాకారులకు కల్పించిన సౌకర్యాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేఖర్‌గౌడ్, బట్టువేణు, వ్యాయామ ఉపాధ్యాయులు, సంఘం నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, గోపిరెడ్డి, తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

డిచ్‌పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దులం ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర అవార్డు గ్రహీత గుంజిళ్ల మాస్టార్ అందె జీవన్ రావు సోమవారం సుపర్ బ్రెన్ యోగా అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ యోగా ద్వారా మెదడు చురుకు పెరిగి జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని తాజా పరిణామాలు పరిశోధన లు తెలియజేశాయని విద్యార్థులకు ఆయన వివరించారు. పిలిపిన్స్‌కు చెందిన ఆధునిక ప్రానిక్ ఇల్లింగ్ వ్యవస్థాపకుడు చౌచక్ సుయ్ గుంజిళ్లపై అధ్యయనం చేశారని దీంతో జ్ఞాపకశక్తి మరింత పెరుగుతుందన్నారు. ఈ యోగా చేయడం వల్ల విద్యార్థుల్లో జ్ఞానం, ఏకాగ్రత, గుర్తుంచుకోవడం అభ్యాసనం, సమస్య పరిష్కారం, మెరుగైన శ్రద్ధ సృజనాత్మకత, ఆసక్తి మానసిక, రోగనిరోధక శక్తి పెంపొందుతాయని విద్యార్థులకు ఆందోళన నుంచి ఉపశమనం పొందుతరన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను 14 రౌండ్లు యోగా చేయించారు. అనంతరం యోగా మాస్టార్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గంగారం, రాజేశ్వర్, ప్రదీప్, తిరుపతిరావు, సాయన్న, నీలబాయి, సునీత, పీఈటీ రమేశ్ పాల్గొన్నారు.

'సమగ్ర శిక్షా ఉద్యోగులు విద్యాశాఖలో భాగమే'

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులు విద్యాశాఖలో భాగమేనని జాక్టో చైర్మన్ చీమల శ్రీకాంత్ అన్నారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కలెక్టరేట్‌లో గత పదిరోజులుగా సమ్మె చేస్తున్న సర్వశిక్షా అభియాన్ ఉద్యోగుల దీక్షను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు విద్యాశాఖలో భాగమేనని అనేక సంవత్సరాలుగా విద్యా వ్యవస్థలో భాగంగా ఉండి విద్యాభివృద్ధికి కృషి చేశారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యూలర్ చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులకు అన్ని విధాల అండగా ఉంటామన్నారు. ఈ దీక్షలో జిల్లా అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాలయ వార్షికోత్సవం

ధర్పల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గల శివాలయం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి పూజా కార్యక్రమాలు ప్రత్యేక పూజలు, హోమం, నిర్వహించారు. గీత కార్మికుల ఆధ్వర్యంలో శివాలయ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.